క్లుప్తంగా

సమాజ సేవ చేయాలి



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

హుస్నాబాద్: ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించి సమాజ సేవ చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూడేళ్ల పాటు కళాశాలలో చదివి విడిచిపెట్టడం కొంత బాధగానే ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కుమారస్వామి, అనిల్ కుమార్, బాలరాజ్, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

సైనికుల్లా కదలాలి

బీఆర్ఎస్ నేత రాధాకృష్ణశర్మ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పల్లెల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా కదలాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పెద్దకోడూరు, మల్లారం, సికింద్లాపూర్ తదితర గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులాబీ శ్రేణులు గ్రామగ్రామాన పార్టీ జెండాను ఆవిష్కరించి, సభకు బయలుదేరాలన్నారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

సాఫ్టుబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కైలాసం



సమావేశంలో మాట్లాడుతున్న కైలాసం

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం అన్నారు. మండలంలోని రామంచ ఉన్నత పాఠశాలలో బుధవారం సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఈ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సాఫ్టుబాల్ క్రీడల్లో ప్రగతి సాధించాలని సూచించారు. క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, కోచ్, పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల



గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు

సిద్దిపేటజోన్: పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక 11వార్డు అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదు ఏళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. బాలింతలు, గర్భిణీలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, జ్యోతి, యమున, ఆయాలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలతో ఊరేగింపుగా మహిళలు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లిలో గ్రామస్తులు బుధవారం గ్రామదేవతలకు బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రారంభానికి 'కేజీబీవీ' సిద్ధం

- అక్కన్నపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ భవనం
- రూ.3.20 కోట్ల నిధులు



అక్కన్నపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం భవనం

అక్కన్నపేట, (హుస్నాబాద్): అక్కన్నపేట మండల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. భవన నిర్మాణ పనులు తుదిదశలో భాగంగా 'కొత్త కేజీబీవీ భవనానికి' రంగులు వేయడంతో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులను ఆకట్టుకుంటుంది. ఈ భవన నిర్మాణానికి 2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దాదాపు రూ.3.20కోట్ల నిధులను కేటాయించారు. బిల్లులు విడుదల కాక కొంత ఆలస్యం అయినా ప్రస్తుతం ప్రారంభానికి ముస్తాబైంది. దాదాపు 95శాతం పనులు పూర్తి కాగా చిన్నచిన్న పనులు కూడా వారంలోపు పూర్తి కానున్నట్లు గుత్తేదారుడు చెబుతున్నారు. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యాసంవత్సరంలో ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీని తరలిస్తారు. ఎనిమిదేళ్లుగా అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య నెట్టుకొస్తున్న కేజీబీవీ విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి.

ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది.

సర్వే నంబర్ 387లో దాదాపుగా 5ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేజీబీవీ బాలికల పాఠశాలకు కేటాయించారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలి. కానీ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

కేజీబీవీ భవన నిర్మాణ పనులు సుమారుగా 95శాతం వరకు పూర్తయ్యాయి. చిన్నచిన్న పనులు కూడా వారంలోపు పూర్తి చేస్తారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రారంభానికి సమయం అడుగుతాం.

– సాయికిరణ్, విద్యాశాఖ ఏఈ

మత్తు పదార్థాలపై అప్రమత్తత అవసరం



వడ్లూరులో మాట్లాడుతున్న సీఐ శ్రీను

బెజ్జంకి(సిద్దిపేట): గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. మండలంలోని వడ్లూరులో మంగళవారం కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానితులు గ్రామాల్లో తిరిగినప్పుడు 100కు గాని, పోలీసులకు గాని సమాచారమివ్వాలని సూచించారు. అనంతరం ఎలాంటి ధ్రువపత్రాలు లేని 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో నార్కొటిక్ డ్రగ్స్ అనుమానాస్పద ప్రాంతాలను జాగిలాలతో తనిఖీ చేశారు. కార్యక్రమంలో చిన్నకోడూర్, సిద్దిపేట రూరల్, రాజగోపాల్‌పేట, మిరుదొడ్డి ఎస్‌ఐలు బాలకృష్ణ, అపూర్వరెడ్డి, ఆసిఫ్, పరశురాములు, ఏఎస్‌ఐ శంకర్‌రావు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

సీపీఐ మండల కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

అక్కన్నపేట (హుస్నాబాద్): అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ఇవ్వాలని సీపీఐ మండలాధ్యక్షుడు కొమ్ముల భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులకే సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారన్నారు. అసలైన నిరుపేదలకు న్యాయం చేయడం లేదని వాపోయారు. అధికారులు సైతం అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు వింటున్నారని మండిపడ్డారు. ఇలాగే కొనసాగిస్తామంటే గ్రామగ్రామాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, సంపత్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

వ్యక్తిత్వ మానసిక నిపుణుడు ఉమాపతి



అవగాహన కల్పిస్తున్న మానసిక నిపుణుడు ఉమాపతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించాలని, ప్రముఖ వ్యక్తిత్వ మానసిక నిపుణుడు ఉమాపతి అన్నారు. ఏబీవీపీ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలీసెట్ శిక్షణ కార్యక్రమంలో బుధవారం పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మానసిక ఒత్తిడి తగ్గించుకునే అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దన్నారు. తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య, నగర కార్యదర్శి పరశురాం, అనీష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి : మంద పవన్

బెజ్జంకి(సిద్దిపేట): సీపీఐ పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. మండలంలోని గుగ్గిల్ల, తిమ్మాయపల్లె గ్రామాల్లో బుధవారం గ్రామశాఖల మహాసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమసమాజ స్థాపనకు పోరాటాలు చేస్తున్నది సీపీఐ మాత్రమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రూపేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, జనార్ధన్, మల్లేశం, రవీందర్, తిరుపతి, కనుకయ్య పాల్గొన్నారు.

ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయొద్దు

సీఐ లతీఫ్



తొగుట సీఐ లతీఫ్

తొగుట(దుబ్బాక): రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణ కావద్దని తొగుట సీఐ ఎస్కె లతీఫ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం ఆరబోసి వాహనదారుల మరణానికి కారణం కావద్దని రైతులకు సూచించారు. రాత్రి సమయంలో వడ్ల కుప్పలను గమనించకుండా అనేక మంది ప్రమాదాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ధాన్యాన్ని పొలాల వద్ద ఆరబోసుకొని విక్రయ కేంద్రాలకు తరలించాలన్నారు. ధాన్యం కుప్పలపై నల్లని టార్పాలిన్ కవర్లు కప్పి చుట్టూ రాళ్లు పడుతున్నారని.. దీంతో ఎదురుగా వాహనాలు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతులు మానవత్వంతో ఆలోచించాలని కోరారు.

ప్రమాదాలకు కారణం కావొద్దు

సిద్దిపేటరూరల్: రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి ప్రమాదాలకు కారణం కావొద్దని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ. గూడ అపూర్వరెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రోడ్లపై పోస్తున్నారు. దీంతో వాహనదారులకు ప్రమాదాల బారిన పడి మరణించిన సంఘటనలు ఉన్నాయన్నారు. రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరపోయకుండా పొలం వద్దనే ఆరబెట్టుకునేలా చూసుకోవాలని సూచించారు. రోడ్లపై గుంటగా పోయడంతో రాత్రి సమయంలో కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రజలకు మేలు జరిగేలా భూభారతి

కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేటరూరల్: ప్రజలకు మేలు జరిగేలా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెడుతుందని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. బుధవారం మండలంలోని రాఘవాపూర్‌లో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ మను చౌదరి హాజరయ్యారు. ముందుగా భూభారతి చట్టంలోని వివిధ అంశాలను అదనపు కలెక్టర్ రైతులకు , ప్రజలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యలపై అధికారులు అందించిన అర్డర్లపై భూభారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని నేడు అలాంటి అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి పొందకపోతే సివిల్ కోర్టుకు వెళ్లవచ్చని, దరఖాస్తుదారులకు ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ సదానందం, జెడ్పీ సీఈఓ రమేశ్, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న భూభారతితో రైతులకు మేలు చేకూరుతుందని సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ అనీఫ్ పేర్కొన్నారు. బెజ్జంకిలోని ప్యాక్స్ సమావేశ మందిరంలో భూభారతిపై రైతులు, నాయకులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. భూరికార్డుల్లో జరిగిన తప్పిదాలను సవరిస్తామన్నారు. వి క్రయదారుల భూసర్వే, రెవెన్యూ అధికారులు పరిశీలించి హద్దులు నిర్ధారించాకే రిజిస్ట్రేషన్‌లు చే స్తారని తెలిపారు. భూముల సమస్యలుంటే ఆర్‌డీఓ, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. పరిష్కారం కాకుంటే భూట్రిబ్యునల్‌కు వెళ్లొచ్చని చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్‌డీఓ సదాందం, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, ప్యాక్స్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ పులికృష్ణ, ఏఓ సంతోష్, వైస్ చైర్మన్‌లు బండి ర మేష్, శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ వాసు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు అవసరం

ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి



వాలీబాల్ అందిస్తున్న సత్యనారాయణ రెడ్డి

దుబ్బాకటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు కూడా రాణించాలని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం రాయపోల్ మండలం రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలంటే, ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజు వ్యాయామం చేయాలని సూచించారు. వాలీబాల్స్ అందజేసిన ఫౌండేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్కే హైదర్ పటేల్, ఉపాధ్యక్షుడు విజయరేఖ, సభ్యుడు గోవర్ధన్ రెడ్డి, నవీన్, నరేష్ కుమార్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, పీఈటీ అనీఫ్ తదితరులున్నారు.

భగీరథ గేట్‌వాల్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



గేట్‌వాల్ మరమ్మతుతో ఆగిన నీరు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ నెల 22న 'ఎగిసి పడుతున్న భగీరథ' నీరు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా అక్కన్నపేట నుంచి గొల్లపెల్లికి వెళ్లే దారిలో ఎగసి పడుతున్న భగీరథ గేట్‌వాల్స్‌కు మరమ్మతులు చేశారు. గేట్‌వాల్స్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాలతో నీరు ఎగిసిపడ్డాయని, మళ్లీ ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని భగీరథ అధికారులు చెప్పారు.

తల్లిదండ్రుల సహకారం ముఖ్యం

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు ప్రగతిపత్రాలు అందజేస్తున్న డీఈఓ

కొండపాక(గజ్వేల్): పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రుల సహకారం ముఖ్యమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దుద్దెడలోని హైస్కూల్లో బుధవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యతోనే సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నిశినాథులైన అధ్యాపకులుంటారన్నారు. దీనిని గుర్తించకుండా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు పంపుతూ అదనపు భారాన్ని భరిస్తున్నారన్నారు. పాఠశాలల్లో సరైన విద్యాబోధనలు జరగని పక్షంలో ఉపాధ్యాయులను అడిగే అధికారం తల్లిదండ్రులతో పాటు యువతపై ఉందన్నారు. ప్రతీసారి నిర్వహించే పేరెంట్స్ కమిటీ సమావేశానికి తల్లిదండ్రులు హాజరై విద్యార్థుల ప్రగతి రిపోర్టులను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఇంటి వద్ద సెల్‌ఫోన్ల వినియోగానికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఉపాధ్యాయ బృందం సొంత ఖర్చులతో స్టీల్ బాటిల్స్‌ను అందజేయడంపై ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం 6,7,8,9 తరగతుల విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉత్తీర్ణత ధ్రువపత్రాలు అందజేశారు. పాఠశాల ఆవరణలో డయాస్‌ను సుందరీకణగా మార్చేందుకు రూ. 2లక్షలు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయురాలు కిరణ్మయిని డీఈఓ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, కమ్యూనిటీ మొబిలైజర్ ఆఫీసర్ రంగనాథ స్వామి, హెచ్‌ఎంఎం.లక్ష్మి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి,ఉపాధ్యాయులు రజనీ, భారతి, ఉమారాణి,అనిల్,తిరుమల్‌రెడ్డి,మంజుల,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల వంటావార్పు



వంట చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానం రద్దు చేసి పాతవిధానాన్ని కొనసాగించాలని స్థానిక డాక్యుమెంట్ రైటర్లు బుధవారం కార్యాలయ ఆవరణలో వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానంతో డాక్యుమెంట్ రైటర్లతో పాటు పలువురు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.. కావున కొత్త విధానం రద్దు చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పోషణ పక్వాడపై అవగాహన

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రామచంద్రాపూర్‌లో పోషణ పక్వాడపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జయమ్మ మాట్లాడుతూ గోల్డెన్ 1000 డేస్ గురించి వివరించారు. పోషణ లోపం నివారణ, అధిక బరువు నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ హరీశ్, స్వరూప, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

◆ 24 నుంచి సమ్మర్ క్యాంప్

బెజ్జంకి(సిద్దిపేట) : మండలంలోని చిలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మహతిలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్, యోగా, ఇంగ్లిష్ స్పీకింగ్, పాటలు, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు పాఠశాల హెచ్‌ఎం తిరుమలేశ్‌ను సంప్రదించాలని సూచించారు.

◆ ఆకట్టుకున్న కళా ప్రదర్శన

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు సాగింది. డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ చట్టాలపై అవగాహన తప్పనిసరి

సిద్దిపేటజోన్: మహిళా చట్టాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని పోలీసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక దేశాయి బీడీ కంపెనీలో షీటీం ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పనిచేసే చోట మహిళలు లైంగిక వేధింపులకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కిషన్, మమత, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

◆ మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుకొమ్ముతండాలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసిన వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కరంటోతు రవి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం తండాలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. దీంతో విద్యుత్ సమస్య ఉందని చెప్పగాని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ట్రాన్స్‌ఫార్మర్ పంపించినందుకు తండావాసులు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైన్‌మెన్ రమేష్, జూనియర్ లైన్‌మెన్ కిసాన్, తండావాసులు పాల్గొన్నారు.

◆ అక్కన్నపేటకు మంత్రి రాక

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రైతు వేదికలో గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనంతరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ. 8గంటలకు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

◆ పీసీసీ అబ్జర్వర్‌ల నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లాకు పీసీసీ అబ్జర్వర్‌లను నియమిస్తూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌లు బుధవారం ప్రకటించారు. సిద్దిపేట జిల్లా పీసీసీ అబ్జర్వర్‌లుగా పవన్ మల్లాది, మినేని రోహిత్‌రావులను నియమించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

◆ నిబంధనలు తప్పనిసరి

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి సమయంలో భారీ వాహనాలు రాజీవ్ రహదారిపై జాగ్రత్తగా నడపాలని సూచించారు. వాహనాలకు సైడ్ మిర్రర్‌లను తప్పకుండా కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపాదన్నారు.

నిరసనలు .. ర్యాలీలు

జమ్మూకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వారి ఆత్మకుశాంతి చేకూరాలని బుధవారం జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఉగ్రవాదులను తరిమి కొడదాం, భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల ఉగ్రవాద సంస్థ దిష్టిబొమ్మను దహనం చేశారు.



క్షీరసాగర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన



సిద్దిపేటకమాన్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు



నంగునూరులో కొవ్వొత్తుల ర్యాలీ



మిరుదొడ్డిలో నిరసన ర్యాలీ



సిద్దిపేటకమాన్ వద్ద..